సాక్షి నంద్యాల

శనివారం । 1 । ఏప్రిల్ । 2023



కొబ్బరి కాయలు సమర్పణ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబదేవికి ఏప్రిల్ 11న నిర్వహించే కుంభోత్సవ కార్యక్రమంలో స్వాతికబలిగా సమర్పించే కొబ్బరికాయలను శుక్రవారం ఆలయ సిబ్బంది సమర్పించారు.



రూ.లక్ష విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి శుక్రవారం కర్నూలు నగరానికి చెందిన గోరంట్ల శంకర్ దంపతులు రూ.1,00,116 విరాళాన్ని అందించారు.



మల్లన్నకు నృత్య నివేదన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలో శుక్రవారం నిత్యకళావేదికపై కొత్తగూడెంకు చెందిన రమాదేవి రామ్, సంతోషిని నాట్య నిలయం వారిచే సంప్రదాయ నృత్యప్రదర్శన నిర్వహించారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సహెర్
కర్నూలు	సా॥ 6:36	ఉ॥ 4:50
ఆదోని	సా॥ 6:39	ఉ॥ 4:53
నంద్యాల	సా॥ 6:36	ఉ॥ 4:53
ఆత్మకూరు	సా॥ 6:34	ఉ॥ 4:47
బనగానపల్లె	సా॥ 6:39	ఉ॥ 4:47

హదీస్ వెలుగు :

చూపు ఎంత మంచిదో అంతకు మించిన ప్రమాదకారి. మనిషి పాపాలకు చూపు మొదటి ఆయుధం. పాపాలు చేయకుండా ఉండేందుకు చూపును నియంత్రణలో ఉంచుకోండి. – పవిత్ర ఖురాన్

బాలికా.. కేజీబీవీలు రమ్మంటున్నాయి!

పేద, అనాథలతో పాటు బడి బయట ఉన్న బాలికలకు కస్తూర్బా విద్యాలయాలు వరంగా మారాయి. ఉన్నత విద్యాప్రమాణాలు, ఆహ్లాదకర వాతావరణం.. ఇంగ్లిషు మీడియంలో బోధన.. ఇలా ఎన్నో సౌకర్యాలతో కార్పొరేట్ విద్యా సంస్థలను తలపించే ఈ పాఠశాలల్లో ప్రవేశాలకు ఏటా పోటీ పెరుగుతోంది. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశాలకు ప్రభుత్వం దరఖాస్తులను ఆహ్వానించింది. 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు ఉచిత విద్య, వసతి కల్పిస్తుండటంతో తమ పిల్లలను చేర్చేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారు.



కస్తూర్బా విద్యాలయం బాలికలు

- కస్తూర్బా విద్యాలయాల్లో ప్రవేశాలు షురూ
- అనాథ, పేద బాలికలకు వరం
- ఉచిత విద్య, వసతి సదుపాయం
- ఏప్రిల్ 20 వరకు దరఖాస్తులకు అవకాశం

ఆళ్లగడ్డ: చదవాలనే ఆసక్తి ఉన్నా పరిస్థితులు అనుకూలించక కొందరు.. ఆర్థిక స్థోమత లేక మరి కొందరు.. తల్లిదండ్రులను కోల్పోయిన అనాథలు.. ఇలా ఎంతో మంది పలు గ్రామాల్లో గతంలో బాలికలు చదువుకు దూరమయ్యేవారు. అలాంటి వారు చదువు కొనసాగించాలనే లక్ష్యంతో దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఏర్పాటు చేసిన కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలు (కేజీబీవీలు) వరంగా మారాయి. నాడు 6 నుంచి 10వ తరగతి వరకు మాత్రమే చదువుకునే అవకాశం ఉండగా.. ప్రస్తుతం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇంటర్ మీడియట్ వరకు స్థాయి పెంచారు. అలాగే నాడు – నేడు మనబడి కార్యక్రమంలో భాగంగా సౌకర్యాలు మెరుగు పరిచడంతో వాటిలో ప్రవేశాలకు మరింత పోటీ ఏర్పడింది. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 27 కేజీబీవీల్లో 2023- 24 విద్యాసంవత్సరానికి అడ్మిషన్లకు నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నెల 27 నుంచి ఏప్రిల్ 20వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. సీట్ల భర్తీలో నిబంధనల మేరకు అనాథ, సింగిల్ పేరెంట్, బడి మధ్యలో మానేసిన, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ కేటగిరీల వారీగా ప్రాధాన్యతా క్రమంలో సీట్లు కేటాయించనున్నారు. ప్రస్తుతం ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు సీట్లు భర్తీ చేస్తున్నారు. అందులో భాగంగా 6వ తరగతి, ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో మొత్తం సీట్లు భర్తీ చేస్తారు. 7 నుంచి, 8, 9 తరగతులకు ఖాళీల మేరకు అడ్మిషన్లు ఉంటాయి. ఇందుకోసం విద్యాశాఖ ప్రత్యేక మార్గదర్శకాలను రూపొందించింది. apkgbv.apcfss.in వెబ్‌సైట్‌లో విద్యార్థి పేరు, కుటుంబ సభ్యుల వివరాలు, ఆధార్, కుల, ఆదాయ, రేషన్‌కార్డు నకలు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఎంపికైన బాలికలకు ఫోన్ మెసేజ్ ద్వారా సమాచారం అందుతుంది. సంబంధిత పాఠశాల నోటిఫికేషన్ బోర్డులో నేరుగా చూడవచ్చు.

ఖాళీలు ఇలా..

జిల్లాలో 27 కేజీబీవీల్లో 3 మైనార్టీ, 24 జనరల్ విద్యాలయాలు ఉన్నాయి. ఒక్కో పాఠశాలలో 6వ తరగతిలో 40 సీట్లు ఉంటాయి. ఈ లెక్కన 1,080, ఇంటర్ ఫస్ట్ ఇయర్ ప్రవేశానికి సంబంధించి ఒక్కో కేజీబీవీలో 40 సీట్లు మేర 1,080 సీట్లు భర్తీ చేయనున్నారు. వీటితో పాటు ఖాళీగా ఉన్న 7వ తరగతిలో 53, 8లో 29, 9లో 32 సీట్లను భర్తీ చేయనున్నారు.

ఇంటిని మరిపించేలా ..

కేజీబీవీల్లో విధులు నిర్వహించే ఉపాధ్యాయులు, అధ్యాపకులు, వాచ్‌మెన్‌లు, వంట మనుసులు ఇలా ప్రతి ఒక్కరూ మహిళలు మాత్రమే ఉంటారు. విద్యతోపాటు ఉచిత భోజనం, వసతి, పౌష్టికాహారం, యూనిఫాం, షూ, దుప్పట్లు అందజేస్తారు. కరాటే శిక్షణతో పాటు ఇంగ్లిష్, గ్రూప్ డిస్కర్షన్, డ్యాన్స్, చిత్రలేఖనం, యోగా, స్వయం ఉపాధి కోర్సులు, కంప్యూటర్ విద్య, బాలికా సాధికారత క్లబ్‌ల ఏర్పాటు తదితర వాటిపై శిక్షణ, అవగాహన కల్పిస్తారు. తల్లిదండ్రులు లేని అనాథ బాలికలకు విద్యాలయంలోనే అన్ని వసతులు, సౌకర్యాలూ కల్పిస్తున్నారు. ప్రతి మూడు నెలలకోసారి 15 రకాల వస్తువులతో కూడిన హెల్త్ – హైజిన్ కిట్‌లు (ఆరోగ్య పరిశుభ్రత కిట్లు) అందజేస్తారు.

ఉన్నత చదువులు అభ్యసించేలా..

పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన బాలికలు అధిక సంఖ్యలో 10వ తరగతి తర్వాత చదువు మానేస్తున్నారన్న ఉద్దేశంతో గత మూడేళ్లుగా ఇంటర్మీడియట్ కోర్సులను సైతం ప్రవేశ పెట్టారు. ఎంపీసీ, బైపీసీ లాంటి ప్రధాన కోర్సులతో పాటు సీఈసీ, వృత్తి విద్యా కోర్సు అయిన ఎంపీహెడబ్ల్యూ కోర్సును ప్రవేశ పెట్టారు. గ్రామీణ ప్రాంతాల్లోని కొంత మంది అవగాహన లేక వీటిలో చేరలేక పోతున్నారు. దీంతో ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రచారం చేయాలని నిర్ణయించి విద్యాశాఖకు ఆదేశాలు జారీ చేసింది.



కుట్లు, అల్లికలపై శిక్షణ

ఇంటర్ గ్రూప్‌లు ఉన్న కేజీబీవీలు

ఎంఈసీ:	ఆళ్లగడ్డ
ఎంపీసీ:	డోన్, దొర్నిపాడు, గడివేముల, కొలిమిగుండ్ల, మహానంది, మిడుతూరు, అవుకు, పగిడ్యాల, పాములపాడు, శిరివెళ్ల (మైనార్టీ), ఉయ్యలవాడ, సంజామల, రుద్రవరం, కొత్తపల్లె
బైపీసీ:	బండి ఆత్మకూరు, చాగలమర్రి, గోస్పాడు, జూపాడుబంగ్లా, నంద్యాల (జనరల్), ప్యాపిలి, వెలుగోడు, ఆత్మకూరు, పాణ్యం, బనగానపల్లె
సీఈసీ:	బేతంచెర్ల
ఏఅండ్‌టీ:	నంద్యాల (మైనార్టీ)

బాలికలకు మంచి అవకాశం



జిల్లాలోని కేజీబీవీల్లో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. ఏప్రిల్ 20వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఏదైనా సందేహం ఉంటే సమీపంలోని విద్యాలయంలో సంప్రదించవచ్చు. ముఖ్యంగా అనాథ, బడి బయట పిల్లలు, బడి మానేసిన బాలికలను గుర్తించి వారిని అన్ని విధాలుగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. అర్హులైన బాలికలకు మంచి అవకాశం కావడంతో సద్వినియోగం చేసుకోవాలి.

– అనురాధ, జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో – ఆర్డినేటర్

కార్పొరేట్‌కు దీటుగా



అనాథలు, సింగిల్ పేరెంట్, బడి మధ్యలో మానేసిన బాలికలకు కేజీబీవీ విద్యాలయాలు వరంగా మారాయి. కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా విద్యా బోధన, వసతులు అందుతున్నాయి. విద్యార్థినులు తమ కాళ్లపై నిలబడేలా పూర్తి స్థాయిలో శిక్షణ ఇస్తాం. నిరంతరం పర్యవేక్షణ ఉంటుంది. ఇంగ్లిషు మీడియంలో బోధన, డిజిటల్ తరగతులు, సౌకర్యాలు కల్పిస్తున్నాం.

– ప్రిన్సిపాల్, కేజీబీవీ, చాగలమర్రి

న్యూస్‌రీల్

ఎలుగుబంటి అడవిలోకి తరలింపు



బోనులో చిక్కుకున్న ఎలుగుబంటిని తరలిస్తున్న అటవీశాఖ సిబ్బంది

శ్రీశైలం: శ్రీశైల క్షేత్రపరిధిలోని శిఖరేశ్వరం వద్ద సంచరిస్తున్న ఎలుగుబంటిని ఎట్టకేలకు దట్టమైన నల్లమల అటవీ ప్రాంతానికి తరలించారు. దాదాపు రెండు వారాలుగా శిఖరేశ్వరం వద్ద భక్తులు కొట్టే కొబ్బరి చిప్పలు, పండ్లు తింటూ అక్కడే సంచరిస్తున్న ఎలుగుబంటిని అటవీ ప్రాంతానికి తరలించేందుకు అటవీ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఆత్మకూరు నుంచి ఇద్దరు పశు వైద్యాధికారులు, ముగ్గురు రెస్క్యూసిబ్బంది రప్పించి గురువారం రెండు బోన్లను ఏర్పాటు చేశారు. ఎట్టకేలకు అర్ధరాత్రి 2 గంటల సమయంలో ఎలుగుబంటి బోనులో చిక్కుకోగా దట్టమైన అటవీ ప్రాంతానికి తీసుకెళ్లి వదిలేశారు.

3 నుంచి వైఎస్‌ఆర్ పెన్షన్ కానుక పంపిణీ

కర్నూలు(అగ్రికల్చర్): వైఎస్‌ఆర్ పెన్షన్ కానుక కింద ఏప్రిల్ నెల పింఛన్ల పంపిణీకి ఉమ్మడి కర్నూలు జిల్లాకు రూ.125,87,63,750 విడుదలయ్యాయి. 4,54,327 పింఛన్ దారులకు ఈ మొత్తం పంపిణీ చేయనున్నారు. ఏప్రిల్ నెల పింఛన్లను 3వ తేదీ నుంచి పంపిణీ చేయనున్నారు. 2022–23 ఆర్థిక సంవత్సరం ముగియడంతో ఏప్రిల్ 1న బ్యాంకులకు ఆర్‌బీఐ సెలవు ప్రకటించింది. 2న ఆదివారం కావడంతో 3వ తేదీన వార్డు, సచివాలయ సెక్రటరీలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు సంబంధిత బ్యాంకుల నుంచి వైఎస్‌ఆర్ పెన్షన్ కానుక నిధులను డ్రా చేసి.. ఆ వెంటనే పంపిణీ చేపట్టనున్నారు. 3వ తేదీ నుంచి ఐదు రోజుల పాటు పింఛన్ల పంపిణీ కొనసాగుతుంది.

నేటి నుంచి బీఈడ్ థర్డ్ సెమిస్టర్ పరీక్షలు

కర్నూలు సిటీ: రాయలసీమ యూనివర్సిటీ పరిధిలోని బీఎడ్ కాలేజీల్లో శనివారం నుంచి థర్డ్ సెమిస్టర్ పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ మేరకు వర్సిటీ పరీక్షల విభాగం డీన్ విశ్వనాథరెడ్డి శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఏప్రిల్ 10వ తేదీ వరకు జరుగనున్న పరీక్షలకు ఉమ్మడి జిల్లాలో 13 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. రెగ్యులర్ విద్యార్థులు 2,095 మంది, సప్లిమెంటరీ పరీక్షలకు 616 మంది హాజరుకానున్నట్లు ఆయన వెల్లడించారు.

ప్రాధాన్యతా రంగాలకు రుణాలు ఇవ్వండి

- బ్యాంకర్ల సమావేశంలో కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్



మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

నంద్యాల: వ్యవసాయ ఆధారిత, కౌలు, వ్యవసాయ అనుబంధాల రంగాల రైతులకు పంట రుణాలు, స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాలు, హౌసింగ్ తదితర ప్రాధాన్యతా రంగాలకు లక్ష్యం మేరకు రుణాలందించి జిల్లా ఆర్థిక ప్రగతిలో భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ బ్యాంకర్లు, జిల్లా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ చాంబర్‌లో జిల్లా బ్యాంకర్ల సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రాధాన్యత రంగాలకు విరివిగా రుణాలు ఇవ్వడంతో పాటు చిన్న తరహా పరిశ్రమలు, విద్యా సంబంధిత రుణాలు, జగనన్న తోడుకు సంబంధించి బలహీన వర్గాల రుణాలు, అర్హులైన వారికి టిడ్కో రుణాలు అందజేసేందుకు బ్యాంకర్లు ముందుకు రావాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయని ఇందుకు సంబంధించి అన్ని రకాల బ్యాంకు శాఖలు అర్హత పొందిన లబ్ధిదారులకు వెంటనే రుణాలు అందించాలన్నారు. యువ, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అర్హత మేరకు రుణాలు మంజూరు చేసి ఉపాధి కల్పనకు తోడ్పాటు అందించాలన్నారు. సమావేశంలో లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ సత్యనారాయణ, నాబార్డ్ డీడీఎం పార్థవ, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్ రెడ్డి, ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూబీఐ, కెనరా బ్యాంక్, నాబార్డ్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఫెడరల్ బ్యాంక్, ఐఓబీ, మెప్మా, వ్యవసాయ శాఖలకు సంబంధించిన అధికారులు తదితరులు పాల్గొన్నారు.

చెంచు గిరిజనులు స్వయం ఉపాధిలో రాణించాలి

శ్రీశైలంప్రాజెక్టు: నల్లమల చెంచు గిరిజనులు అటవీ ఉత్పత్తులను సేకరించి స్వయం ఉపాధిలో రాణించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి డా.బి.రవీంద్రారెడ్డి అన్నారు. చెంచు గిరిజనులకు తేనెటీగల పెంపకంపై శిక్షణ కార్యక్రమం శుక్రవారం శ్రీశైలం యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో ప్రారంభమైంది. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, నేషనల్ బీ బోర్డు, నేషనల్ బీ కీపింగ్, హనీ మిషన్ సహకారంతో వారం రోజుల పాటు జరిగే ఈ శిక్షణను ఐటీడీఏ పీవో జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. శిక్షణ కార్యక్రమంలో భాగంగా ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన సంస్థ సీనియర్ శాస్త్రవేత్త డా.జె.మంజునాథ్ తేనెటీగల పెంపకం, మెలకువలపై గిరిజనులకు శిక్షణ ఇచ్చారు. తేనెటీగల పెంపకం, దిగుబడి, విక్రయం, రాబడి వంటి అంశాలపై గిరిజనులకు వివరించారు. కార్యక్రమంలో హనీ ఫార్మ్స్ ఉత్పత్తిదారులు రమేష్, ఇలియాజ్‌బాషా, ఐటీడీఏ ఏపీవో పి.మురళీధర్, వైకేపీ అడిషనల్ ప్రాజెక్టు అధికారి కె.లలితాబాయి తదితరులు పాల్గొన్నారు.



తేనెటీగల పెంపకంపై శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఐటీడీఏ పీవో రవీంద్రారెడ్డి

హామీలను నెరవేర్చిన ఏకైక సీఎం వైఎస్ జగన్



ఆసరా మెగా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తదితరులు

కోవెలకుంట్ల: ప్రజా సంకల్పయాత్రలో ప్రజల కష్ట, నష్టాలను స్వయంగా తెలుసుకున్న వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చారని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి అన్నారు. స్థానిక మార్కెట్‌యార్డు ఆవరణలో శుక్రవారం వైఎస్సార్ ఆసరా మూడవ విడత కార్యక్రమ ఉత్సవాలను నిర్వహించారు. బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్సీతో పాటు జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ 2014 ఎన్నికల సమయంలో పొదుపు మహిళలకు సంబంధించిన రూ.16వేల కోట్ల రుణాలను మాఫీ చేస్తానని చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చి.. అధికారంలోకి రాగానే తుంగలో తొక్కాడన్నారు. 2019 ఏప్రిల్ 11 నాటికి పొదుపు మహిళలు బ్యాంకుల్లో రుణాలు తీసుకుని బకాయి పడిన రూ.25,517 కోట్లను నాలుగు విడతల్లో చెల్లిస్తామని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి రాగానే ఇప్పటి వరకు మూడు విడతల్లో రూ.19,137 కోట్లను పొదుపు మహిళ ఖాతాల్లో జమ చేశారన్నారు. ప్రజలకు మేలు చేస్తుంటే ప్రతిపక్షనేత చంద్రబాబుకు కడుపు మండి, ఎల్లో మీడియాను అడ్డుపెట్టుకుని ప్రభుత్వంపై విషం కక్కుతున్నాడన్నారు. గత టీడీపీ ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో పేదల సంక్షేమాన్ని విస్మరించి దోచుకోవడం, దాచుకోవడమే పనిగా పాలన సాగించిందన్నారు. త్వరలో ఎన్నికలు రానుండటంతో ఇప్పటి నుంచే ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నం చేస్తున్నాడని, ప్రజలు వాస్తవాలను గమనించి టీడీపీకి మరోసారి గుణపాఠం చెప్పాలని కోరారు.

మహిళలకు అండగా వైఎస్సార్‌సీపీ

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మహిళలకు అన్నిరంగాల్లో పెద్దపీట వేస్తోందని జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. రుణమాఫీ పేరుతో చంద్రబాబు మోసం చేస్తే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మహిళలకు అండగా నిలిచి ప్రతి ఏటా రూ. 6వేల కోట్లను వారి ఖాతాల్లో జమ చేసిందన్నారు. రాష్ట్రంలో సంక్షేమంతో పాటు అభివృద్ధి పరుగులు పెడుతోందన్నారు. నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా పాఠశాలలు, ఆసుపత్రులను ఆధునీకరించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కిందన్నారు.


పంటల రుణ పరిమితి ఖరారు

- 2023–24లో పంటలకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ఖరారు చేస్తూ ఉత్తర్వులు
- మే నుంచి ఖరీఫ్, అక్టోబర్ నుంచి రబీ రుణాలు మంజూరు
- అర్హులైన రైతులకు కిసాన్ క్రెడిట్‌కార్డులు
- క్రెడిట్ కార్డు ఉంటే పూచీ లేకుండా రూ.1.60 లక్షల వరకు రుణం
- సకాలంలో రుణాలు చెల్లిస్తే వడ్డీ రాయితీ



నంద్యాల: వ్యవసాయ సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో 2023–24 సంవత్సరానికి గాను పంటల వారీగా రుణపరిమితి (స్కేల్‌ఆఫ్ ఫైనాన్స్) ఖరారు చేస్తూ రాష్ట్రస్థాయి టెక్నికల్ కమిటీ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో బ్యాంకుల ద్వారా రైతులు పంట రుణాలు పొందవచ్చు. ఏ పంటకు ఎంత రుణం ఇవ్వాలనే విషయమై జిల్లా స్థాయి సాంకేతిక కమిటీ కలెక్టర్ ఆధ్వర్యంలో సమావేశమై నివేదిక రూపొందించింది. ఈ నివేదికను రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీకి పంపగా అక్కడ నివేదికపై చర్చించి ఆయా పంటలకు రుణ ప్రణాళికను విడుదల చేశారు. కర్నూలు, నంద్యాల ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది రుణ పరిమితిని కొంత సడలించి, రూ.4 వేల నుంచి రూ.5వేల వరకు పెంచుతూ వెసులుబాటు కల్పించారు. ఇస్తూ ఆయా పరిస్థితులకు అనుగుణంగా రుణాలు మంజూరు చేయాలని సూచించారు. కొన్ని జిల్లాల్లో కూలీల రేట్లు, ఇతర అంశాలు పరిగణలోకి తీసుకొని వెసులుబాటు కల్పించినట్లు బ్యాంకు వర్గాలు తెలిపాయి. ఏడాదికేడాది పెట్టుబడి వ్యయం, కూలీల ఖర్చు పెరుగుతుండటంతో వాటిని పరిగణనలోకి తీసుకున్నారు. పంట రుణ పరిమితిని ఒక ఎకరాకు నిర్ణయించారు. ఇందుకు అనుగుణంగా బ్యాంకులు ఖరీఫ్, రబీ సీజన్లకు రుణాలు మంజూరు చేస్తాయి. మే నుంచి సెప్టెంబర్ వరకు ఖరీఫ్‌గా, అక్టోబర్ నుంచి మార్చి వరకు రబీ సీజన్‌గా పరిగణించి రుణ ప్రణాళిక అమలు చేస్తారు. పంట రుణపరిమితి ఆధారంగా ఏడాది కార్యాచరణ రుణ ప్రణాళికను లీడ్‌బ్యాంక్ ఆధ్వర్యంలో తయారు చేస్తారు. అర్హులైన రైతులందరికీ కిసాన్ క్రెడిట్‌కార్డులు మంజూరు చేయాలనే లక్ష్యంగా పని చేస్తున్నారు. ఈ కార్డుల కింద గరిష్టంగా ఎలాంటి పూచీకత్తు లేకుండా రూ.1.60 లక్షల వరకు రుణం అందజేస్తారు. ఇందుకు 7శాతం వడ్డీ వసూలు చేస్తారు. ఏడాదిలోగా రుణం తిరిగి చెల్లిస్తే వడ్డీలో 3 శాతం రాయితీ బ్యాంకు అందజేస్తుంది. రూ.లక్షలోపు రుణం ఏడాదిలోగా చెల్లిస్తే రాష్ట్ర ప్రభుత్వం కూడా 4 శాతం వడ్డీ రాయితీ ఇస్తుంది. దీంతో రూ.లక్ష వరకు రుణం తీసుకున్న రైతు సకాలంలో చెల్లిస్తే వడ్డీ భారం నుంచి మినహాయింపు పొందే అవకాశం ఉంది.

అర్హులైన ప్రతి రైతుకు రుణం



జిల్లాలో అర్హులైన రైతులందరికీ పంట రుణాలు అందజేయడమే లక్ష్యంగా రుణ ప్రణాళిక తయారు చేశాం. కిసాన్ క్రెడిట్‌కార్డులకు రైతులు దరఖాస్తు చేసుకోవాలి. కిసాన్ క్రెడిట్ కార్డు ఉంటే ఎలాంటి పూచీకత్తు లేకుండా రూ.1.60 లక్షల వరకు రుణం బ్యాంకులు అందజేస్తాయి. రుణం ఏడాదిలో చెల్లిస్తే వడ్డీ కట్టాల్సిన అవసరం ఉండదు. పంటలకు వెచ్చిస్తున్న పెట్టుబడిని పరిగణలోకి తీసుకొని పంట రుణ పరిమితిని రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ ప్రతి ఏడాది నిర్ణయిస్తుంది. రైతులు ప్రైవేటు వ్యాపారుల వద్ద అధిక వడ్డీకి రుణాలు తీసుకొని ఇబ్బందులు పడకుండా.. బ్యాంకుల్లో రుణాలు తీసుకొని వడ్డీ రాయితీ పొందాలి. ఈ మేరకు క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

– సత్యనారాయణ, జిల్లా లీడ్‌బ్యాంక్ మేనేజర్, నంద్యాల

2023-24లో పంటల వారీగా రుణ పరిమితి (ఎకరాకు)

పంట	రుణపరిమితి (రూపాయల్లో)
వరి(ఖరీఫ్)	38,000-42,000
వరి (రబీ)	42,000-45,000
జొన్నలు(నీటి వసతి)	19,000-21,000
జొన్నలు(వర్షాధారం)	17,000-20,000
మొక్కజొన్న	38,000-42,000
కందులు	18,000-22,000
పత్తి(వర్షాధారం)	40,000-45,000
పత్తి(నీటివసతి)	38,000-42,000
వేరుశనగ(వర్షాధారం)	32,000-35,000
వేరుశనగ(నీటిసవతి)	28,000-32,000
శనగలు	28,000-32,000
పొద్దుతిరుగుడు	19,000-24,000
పచ్చిమిర్చి	68,000-75,000
పండుమిరప	80,000-90,000
పొగాకు	36,000-40,000
టమాట (హైబ్రీడ్)	80,000-90,000
టమాట (ట్రెల్లీస్)	65,000-70,000
అరటి	65,000-80,000
దానిమ్మ	75,000-90,000
బొప్పాయి	72,000-75,000
మామిడి	40,000-45,000
నిమ్మకాయ	22,000-27,000

సామాజిక సేవలను విస్తృతం చేయాలి

నంద్యాల(అర్బన్): కోరమాండల్ ఇంటర్నేషనల్ సంస్థ రైతులకు, ప్రజలకు అందించే సేవా కార్యక్రమాలను విస్తృతం చేయాలని నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి పేర్కొన్నారు. సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక రైల్వేస్టేషన్‌లోని కార్మికులు, హమాలీలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరాన్ని ప్రారంభించిన అనంతరం ఎంపీ పోచా మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో అగ్రగామిగా ఉన్న కోరమాండల్ సంస్థ మరిన్ని సామాజిక సేవలను అందించి బాధితులను ఆదుకోవాలన్నారు. వైద్య శిబిరంలో దాదాపు 300 మందికి ఉదయానంద ఆసుపత్రి వైద్యులు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీఏఓ మోహన్‌రావు, ఏడీఏ రాజశేఖర్, ఏఓ స్వప్నికారెడ్డి, కోరమాండల్ కంపెనీ ప్రతినిధులు గోవిందరావు, శ్రీధర్‌రెడ్డి, రఘుకుమార్, దియ్యాల మధుసూదనరావు, నాగమణి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఉచిత వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి

క్లుప్తంగా

తాటి ముంజలకు వెళ్లి మృత్యు ఒడికి..


మృతి చెందిన బాల లింగమయ్య

రుద్రవరం: జీవనోపాధిలో భాగంగా తాటి ముంజలు కోసేందుకు వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తూ మృత్యువాత పడ్డాడు. ముత్తలూరుకు చెందిన చిట్టిగాళ్ల బాల లింగమయ్య(38) శుక్రవారం నర్సాపురం సమీపంలోని తాటి వనంలో ముంజలు కోసేందుకు వెళ్లాడు. అక్కడ చెట్టు పైకి చేరుకొని ముంజలు కోస్తుండగా ప్రమాదవశాత్తూ కాలు జారి కింద పడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడిని ఆళ్లగడ్డ ఆసుప్రతికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడికి భార్య రమణమ్మ, కుమారుడు డేవిడ్, కుమార్తె నిరీక్షణ ఉన్నారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ నిరంజన్‌రెడ్డి ఘటనాస్థలికి చేరుకొని ప్రమాద వివరాలు తెలుసుకుని కేసు నమోదు చేశారు.

ప్రాణం తీసిన విద్యుదాఘాతం


మృతి చెందిన సుశీలమ్మ

కొలిమిగుండ్ల: ఇటిక్యాల కోట్ల ఫారం ఎస్సీ కాలనీలో శుక్రవారం విద్యుదాఘాతంతో ఓ వృద్ధురాలి మృతి చెందింది. కాలనీకి చెందిన సుశీలమ్మ(65) ఇంటి మీదుగా 33/11 కేవీ విద్యుత్ లైన్ వెళ్లింది. తీగలకు పక్కనే మేడిపండు చెట్టు ఉండటం, కొమ్మలు తగులుతున్నాయని శుక్రవారం మధ్యాహ్నం వాటిని తొలగిస్తుండగా విద్యుదాఘాతానికి గురైంది. కుటుంబ సభ్యులు చికిత్స కోసం కొలిమిగుండ్లలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకురాగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

బైక్ అదుపు తప్పి వ్యక్తి మృతి


మృతి చెందిన బోనాల రవి

పాములపాడు: కర్నూలు – గుంటూరు రహదారిపై కంబాలపల్లి గ్రామం వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. వేంపెంట గ్రామానికి చెందిన బోనాల రవి (36)కి నాలుగేళ్ల క్రితం కర్నూలుకు చెందిన సంధ్యారాణితో వివాహమైంది. కాగా రెండు నెలల క్రితం మనస్పర్థలతో సంధ్యారాణి పుట్టింటికి వెళ్లింది. భార్యను పిలుచుకువస్తానని ఇంట్లో తల్లికి చెప్పి బైక్‌పై కర్నూలుకు బయల్దేరాడు. కాగా కంబాలపల్లి గ్రామం వద్ద అదుపు తప్పి పక్కనే ఉన్న బోర్డును ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని 108లో ఆత్మకూరు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

డిగ్రీ పరీక్షల్లో 15 మంది డిబార్

కర్నూలు సిటీ: రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో జరుగుతున్న డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో 15 మంది విద్యార్థులు డిబార్ అయ్యారు. శుక్రవారం జరిగిన పరీక్షలకు మొత్తం 14,024 మంది విద్యార్థుల్లో 12,759 మంది హాజరైనట్లు వర్సిటీ పరీక్షల విభాగం అధికారులు తెలిపారు

ALLAGADDA MUNICIPALITY
Address: Ahobilam Road, Allagadda, Telephone No: 89788 85220,
E-mail Id: mc.allagadda@cdma.gov.in
E-Tender: **Upgradation of CC Road Work**
Tender Notification No. 08(1-2)/GGMP-2022-23/ALGM: **Dated: 01-04-2023**
Bid Document Download Start Date and Time : 01-04-2023 @ 10.00 AM
Bid Document Download End Date and Time : 15-04-2023 @ 04.00 PM
Bid Submission Closing Date and Time : 15-04-2023 @ 04.30 PM
E-Tender Website: https://tender.apeprocurement.gov.in/
E-Mail ID for Clarifications/ Communication : mc.allagadda@cdma.gov.in
Note: Any addendum/ corrigendum/ bid clarifications / time extension shall be issued on the website only. No separate press notification shall be issued.
Contact No: 8978885220 & 9398828017
Sd/- Commissioner, Allagadda Municipality



కర్నూలు నాగిరెడ్డి రెవెన్యూ కాలనీలోని మున్వార మసీదులో ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు. మసీదులో చిన్నారుల దువా

సమత..మమత

రంజాన్ నెలలో మొదటి ఏడు రోజులు గడిచిపోయాయి. దీంతో శుక్రవారం ముస్లింలు మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చిన్నారులు సైతం అల్లాహ్ దీవెనలు అందుకునేందుకు కఠిన ఉపవాసాలు ఆచరిస్తున్నారు. పవిత్ర మాసంలో ముస్లింల ఇంట సమత..మమతలు వెల్లివిరుస్తున్నాయి.
– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు


ఉపవాస దీక్షను విరమిస్తున్న దృశ్యం

మాసమంతా పుణ్యమే!

- రంజాన్‌లో దాన ధర్మాలకు ప్రాధాన్యం
- ఒక రూపాయి దానం చేస్తే రూ.70 చేసిన ఫలితం
- నఫిల్ నమాజు చదివితే ఫరజ్ ప్రతిఫలం

కర్నూలు (రాజ్‌విహార్): రంజాన్.. ముస్లింలకు పవిత్ర మాసం. అంతేకాదు పుణ్యాలు సంపాదించుకునే మాసం కూడా ఇదే. ఇస్లామిక్ క్యాలెండర్‌లో షాబాన్ ముగిశాక వచ్చే ఈ నెలకు చాలా ప్రత్యేకత ఉంది. అత్యంత నియమనిష్ఠలతో ఉపవాసాలు, దివ్య ఖురాన్ పఠనం, ఐదు పూటల నమాజ్, తరావీ నమాజ్ చదువుతారు. దీంతో పాటు ప్రతి ముస్లిం తమ సంపాదనలో కొంత భాగం పేదల కోసం వెచ్చిస్తారు. ఎందుకంటే చేసే ఏ సాయానికి అయిన 70 రేట్లు అధిక ఫలం లభిస్తుందని మత పెద్దలు చెబుతారు. దీంతో నెల పొడవునా ముస్లింలు విరివిగా దానధర్మాలు చేస్తుంటారు. మహమ్మద్ ప్రవక్త సొల్లెల్లాహు అలైహి వసొల్లం సూచించిన మార్గాలను అనుసరిస్తే పాప విముక్తులై దేవుడి



అనుగ్రహం పొందుతారని మౌల్వీలు చెబుతున్నారు.
- ఫరజ్: అల్లాహ్ సూచించిన, కచ్చితంగా పాటించాల్సిన నిబంధనలను ఫరజ్ అంటారు. వీటిని ముస్లింలు తప్పనిసరిగా ఆచరించాలి. చిన్న పిల్లలు, మానసిక స్థితి సరిగా లేని వారు, అనారోగ్య సమస్యలున్న వారికి మినహాయింపు ఉంటుంది. నమాజ్, రోజా, జకాత్, హజ్ యాత్ర వంటివి ఫరజ్ పరిధిలోకి వస్తాయి. రోజుకు ఐదు పూటల నమాజ్, రంజాన్ జకాత్ పేరుతో దాన ధర్మాలు, హజ్ యాత్ర చేయాలి. సాధారణ రోజుల్లో ఒక ఫరజ్ నమాజ్ చేస్తే 3,35,54,032 నేకియా (మార్కులు) లభిస్తాయి. రంజాన్‌లో 70 రెట్లు అధికంగా ఉంటుందని మత పెద్దలు చెబుతున్నారు.
- సున్నత్: మహమ్మద్ ప్రవక్త (సా.అ.వ.) దిన చర్యలో పాటించిన నియమాలను సున్నత్ అంటారు. ఇవి ప్రతి ముస్లిం ఆచరించాలి. గుసుల్ (శుద్ధి స్నానం), వజూ చేయటం, మిస్వాక్ వాడడం, ఫరజ్ నమాజులకు ముందు, తరువాత ప్రవక్త చేసిన నమాజ్‌లను సున్నత్ అంటారు. ఇలా ఎన్నో ఉన్నాయి.
- నఫిల్: భక్తి కొలది మనం చేసుకునే ప్రార్థనలను నఫిల్‌గా అంటారు. నమాజ్, రోజా, హజ్‌లో నఫీల్‌ను ఆచరించవచ్చు. తగిన ఫరజ్ పుణ్యం లేని పక్షంలో మరణం తరువాత నఫీల్‌ను పరిగణలోకి తీసుకుంటారు. రంజాన్ మాసంలో ఒక నఫిల్ నమాజ్ చేస్తే ఫరజ్ చదివిన పుణ్యం లభిస్తుంది. అందుకే సమయం దొరికిన ప్రతి సారి నఫీల్ నమాజ్ చదువుతూ ఉండాలి.

ఇది పుణ్యాల నెల



మానవులకు అధికంగా పుణ్యం చేకూర్చేందుకు అల్లాహ్ ప్రసాదించిన నెల రంజాన్. ఈ మాసంలో అధ్యాత్మికతలో గడపాలి. ఫరజ్ నమాజులతో పాటు సున్నత్, నఫీల్, ఖురాన్ తరచూ చదవాలి. నిరుపేదలకు ఫిత్రా, జకాత్‌లు దాన ధర్మాలు చేయాలి.
– హాఫిజ్ మంజూర్ అహ్మద్, రాష్ట్ర హజ్ కమిటీ సభ్యులు

ఆరోగ్యం జాగ్రత్త..

రంజాన్ మాసంలో ముస్లింలు కఠోర ఉపవాస దీక్షలు పాటిస్తారు. కనీసం నీరు కూడా తీసుకోరు. అయితే షుగర్ వ్యాధిగ్రస్తులు ముందు జాగ్రత్తలు తీసుకోవాలని, లేకపోతే ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతుందని వైద్యులు సూచిస్తున్నారు.
- ఇఫ్తార్ సమయంలో ఆహార పదార్థాలు, పానీయాలపై నియంత్రణ ఉండాలి. తక్కువ కేలరీలు ఉన్న ఆహార పదార్థాలు, పానీయాలే తీసుకోవాలి.
- ఇన్సులిన్ ఉత్పత్తిని సరిదిద్దగలిగే షుగర్ మందు మెట్ఫోర్మిన్ వాడుతున్నవారు ఇఫ్తార్ సమయంలో మాత్రల మోతాదులను వైద్యుడి సలహాతో తీసుకోవాలి.
- పాంక్రియాస్ గ్రంధి నుంచి ఇన్సులిన్ విడుదలకు దోహదపడే గ్లిబెన్క్లమైడ్ మందులు వాడుతున్న వారు వైద్యుడి సలహాతో స్వల్ప వ్యవధికి పని చేసే గ్లిపిజైడ్, రేపగ్లినైడ్ వాడవచ్చు.
- టైప్- 1 డయాబెటీస్ నియంత్రణలో లేనివారు, టైప్-2 డయాబెటీస్ ఉన్నవారు ఉపవాసం ఉండకపోవడం మంచిది.
- ఇఫ్తార్‌లో తీసుకునే తియ్యటి ఆహార పదార్థాలను తక్కువ మొత్తానికే పరిమితం చేయాలి. అన్నం, చపాతీలు, నాన్ వంటి పిండి పదార్థాలను ఎక్కువగా తీసుకోవాలి.
- ఇఫ్తార్, సహెరీలో పప్పు, పెరుగు, పండ్లు, కూరగాయలు ఎక్కువగా తినాలి.
- సహెరీ భోజనం మరీ అర్ధరాత్రి కాకుండా సూర్యోదయానికి ముందు తీసుకోవాలి. ఇది ఉపవాస సమయంలో సమాంతర శక్తి పొందటానికి, రక్తంలో చక్కెర స్థాయి స్థిరంగా ఉంచడానికి ఉపయోగపడుతుంది.

నైపుణ్యాభివృద్ధి శిక్షణకు రిజిస్ట్రేషన్లు: కలెక్టర్

కర్నూలు(సెంట్రల్): జిల్లాలోని అన్ని నియోజకవర్గాల స్కిల్ హబ్‌లు, జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన స్కిల్ కాలేజీలో శిక్షణకు రిజిస్ట్రేషన్‌లు ప్రారంభమైనట్లు కలెక్టర్ పి.కోటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో కలెక్టర్ అధ్యక్షతన జిల్లాస్థాయి స్కిల్ డెవలప్‌మెంట్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కర్నూలు సిల్వర్ జూబ్లీ డిగ్రీ కాలేజీ, పెద్దకడబూరు మండలం మురవణిలోని గర్ల్స్ డిగ్రీ కాలేజీ, ఆదోని న్యాక్ సెంటర్, కర్నూలు న్యాక్ సెంటర్, ఆలూరు గర్ల్స్ జూనియర్ కాలేజీ, పత్తికొండ డిగ్రీ కాలేజీ, ఎమ్మిగనూరు గర్ల్స్ జూనియర్ కాలేజీలలో స్కిల్ హబ్‌లను ఏర్పాటు చేశామన్నారు. అలాగే కర్నూలులోని టీటీడీసీ డీఆర్‌డీఏ ట్రెనింగ్ సెంరట్‌ను స్కిల్ కాలేజీగా మార్చినట్లు చెప్పారు. ఆయా సెంటర్లలో డిగ్రీ అర్హత ఐటీ,


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పి.కోటేశ్వరరావు

ఐటీ–ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్, బ్యాంకింగ్, ఫైనాన్స్ రంగాల్లో ఉద్యోగాలు పొందడానికి అవసరమైన నైపుణ్యాలపై శిక్షణ ఇస్తారన్నారు. అలాగే నిర్మాణ రంగంలో ఎలక్ట్రికల్‌కు 10వ తరగతి, ప్లంబింగ్‌కు 8వ తరగతి అర్హతగా నిర్ణయించామన్నారు. కష్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్, డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టులకు ఇంటర్ అర్హతతో నాన్ రెసిడెన్షియన్ విధానంలో శిక్షణ పొందవచ్చన్నారు. స్కిల్ కాలేజీలో కెమిస్ట్రీ సబ్జెక్ట్ డిగ్రీ అర్హతతో పేషెంట్ రిలేషన్ సర్వీసు డ్యూటీ మేనేజర్‌గా శిక్షణ తీసుకుంటే పరిశ్రమలు, ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగాలు పొందేందుకు అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్‌యూ వీసీ ఆనందరావు, డీఆర్‌డీఏ పీడీ వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ ఎలా చేసుకోవాలంటే..
- ఏపీఎస్ఎస్‌డీసీ.ఇన్ అనే వెబ్‌సైట్‌లో.. లేదా గూగుల్ ప్లేస్టోర్‌లో ఏపీఎస్ఎస్‌డీసీ స్కిల్ హబ్ అనే యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు.
- సమీపంలోని గ్రామ, వార్డు సచివాలయాల్లోని డిజిటల్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు.
- ఇతర వివరాలకు 9059290821 నంబర్‌ను సంప్రదించవచ్చు.

ఉపాధ్యాయులకు వెబెక్స్ ద్వారా శిక్షణ

నంద్యాల(సిటీ): ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి పాఠ్యాంశాలు బోధిస్తున్న ఉపాధ్యాయులందరికీ శనివారం నుంచి వెబెక్స్ ద్వారా ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారిణి అనురాధ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మొదటి విడత ఏప్రిల్ 1వ తేదీన మధ్యాహ్నం ఆళ్లగడ్డ, ఆత్మకూరు, బండిఆత్మకూరు, బేతంచెర్ల, చాగలమర్రి, డోన్, దొర్నిపాడు, గడివేముల, గోస్పాడు ఉపాధ్యాయులకు ఉంటుందన్నారు. ఏప్రిల్ 3వ తేదీ ఉదయం జరిగే రెండవ విడతలో జూపాడుబంగ్లా, కోవెలకుంట్ల, కొలిమిగుండ్ల, కొత్తపల్లె, మహానంది, మిడుతూరు, నందికొట్కూ రు, నంద్యాల, అవుకు, పగిడ్యాల మండలాల ఉపాధ్యాయులు పాల్గొనాలన్నారు. అదే రోజు మధ్యాహ్నం జరిగే మూడవ విడతకు పాములపాడు, పాణ్యం, ప్యాపిలి, రుద్రవరం, సంజామల, శిరివెళ్ల, శ్రీశైలం, ఉయ్యాలవాడ, వెలుగోడు, బనగానపల్లె మండలాలకు చెందిన ఉపాధ్యాయులు హాజరు కావాలన్నారు.

మార్కెట్ యార్డు ఆదాయం పెంపుపై ప్రత్యేక దృష్టి


మార్కెట్ కమిటీ సమావేశంలో పాల్గొన్న పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, మేయర్ బీవై రామయ్య

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డు ఆదాయం పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను పాణ్యం ఎమ్మెల్యే, మార్కెట్ కమిటీ గౌరవ చైర్మన్ కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం మార్కెట్ యార్డులో కమిటీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన మార్కెట్ కమిటీ సమావేశంలో కాటసాని మాట్లాడారు. 2023–24లో వ్యవసాయ ఉత్పత్తుల క్రయవిక్రయాల ద్వారా రూ.6.15 కోట్లు ఆదాయం సాధించే విధంగా మార్కెట్ కమిటీ నిర్ణయించిందని, ఆదాయం పక్కదారి పట్టకుండా సూపర్‌వైజర్లు, అసిస్టెంటు సెక్రటరీలు నిఘా పెంచాలని సూచించారు. 2023 మార్చి 31 నాటికి మార్కెట్ యార్డులోని 175 మంది కమీషన్ ఏజెంట్ల లైసెన్స్ గడువు పూర్తి అయిందని, వీటిని పారదర్శకంగా రెన్యువల్ చేయాలన్నారు. మార్కెట్ యార్డులో రూ.6 కోట్లతో చేపట్టిన జంబోషెడ్ నిర్మాణపు పనులు కాస్త మందగించాయని, పనులను వేగవంతం చేయాలన్నారు. కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య మాట్లాడుతూ.. మార్కెట్ యార్డులో పరిశుభ్రతను పెంపొందించేందుకు నగర పాలకసంస్థ తరఫున అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. మార్కెట్ యార్డు అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. రైతులు మార్కెట్‌లో మోసానికి గురి కాకుండా ప్రత్యేక టీమ్‌లు ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో ఎంపిక శ్రేణి సెక్రటరీ గోవిందు, వైస్ చైర్మన్ భీమేశ్వరరెడ్డి, అసిస్టెంట్ సెక్రటరీలు రహిమాన్, వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్‌లు కేశవరెడ్డి, శివన్న తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా నాగభూషణం

- ప్రధాన కార్యదర్శిగా చక్రపాణి విజయం


జిల్లా న్యాయవాదుల సంఘం ఎన్నికల్లో గెలుపొందిన న్యాయవాదులు

కర్నూలు(లీగల్): కర్నూలు జిల్లా న్యాయవాదుల సంఘానికి శుక్రవారం జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా టి.నాగభూషణం నాయుడు, ప్రధాన కార్యదర్శిగా ఎంవీ చక్రపాణి విజయం సాధించారు. మొత్తం 903 ఓట్లు ఉండగా 778 ఓట్లు పోల్ అయ్యాయి. అధ్యక్ష పదవికి పోటీ పడిన టి.నాగభూషణం నాయుడు తన ప్రత్యర్థి బి.చంద్రుడిపై 7 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. నాగభూషణం నాయుడుకు 391 ఓట్లు రాగా, చంద్రుడుకు 384 ఓట్లు పోలయ్యాయి. ప్రధాన కార్యదర్శి పదవికి పోటీ చేసిన ఎంవీ చక్రపాణి 39 ఓట్లతో సమీప ప్రత్యర్థి డి.నరసింహులుపై విజయం సాధించారు. ఉపాధ్యక్ష పదవికి పోటీలో ఉన్న ఎస్.షాబుద్దిన్ 68 ఓట్ల తేడాతో నిత్యజీవన్‌రాజుపై గెలుపొందారు. మహిళా ప్రతినిధి స్థానం కోసం పోటీ పడిన సి.జాస్మిన్ తన ప్రత్యర్థి ఎ.అన్నపూర్ణారెడ్డిపై 93 ఓట్లతో గెలుపొందారు. ప్రత్యర్థులుగా పోటీ చేసిన వారు తమ నామినేషన్లు ఉపసంహరించుకోవడంతో కార్యదర్శిగా ఎస్.లక్ష్మణ్, కోశాధికారిగా ఎం.షఫత్, గ్రంథాలయ కార్యదర్శిగా వి.రవికుమార్, క్రీడల కార్యదర్శిగా బి.రాకేష్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి కె.రాజమోహన్‌రెడ్డి ప్రకటించారు. పోలింగ్‌లో ఎన్నికల అధికారికి న్యాయవాదులు పి.వి.వరప్రసాదరావు, ఆంజనేయులు, లోకేశ్వరరెడ్డి, రామకృష్ణ సహాయాధికారులుగా వ్యవహరించారు.

పది పరీక్ష క్రేంద్రాల్లో పకడ్బందీ ఏర్పాట్లు


కేజీబీవీలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన డీఈఓ అనురాధ, ఎంఈఓ శ్రీరాములు

కొత్తపల్లి: పదో తరగతి పరీక్ష కేంద్రాల్లో పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా విద్యాధికారిణి అనురాధ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. ఏప్రిల్ 3వ తేదీ నుంచి పది పరీక్షలు ప్రారంభవుతున్న నేపథ్యంలో సమస్యలు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని ఆయా పరీక్ష కేంద్రాల సూపరింటెండెంట్లను ఆదేశించారు. కేజీబీవీ, జెడ్పీహెచ్ఎస్ పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి, వారి సామర్థ్యాలను ప్రశ్నల ద్వారా తెలుసుకున్నారు. ఎమ్మార్సీ భవనాన్ని సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. ఆమె వెంట మండల విద్యాధికారి శ్రీరాములు, ప్రధానోపాధ్యాయులు సుబ్బారెడ్డి, రామలక్ష్మి, ఉపాధ్యాయ సిబ్బంది ఉన్నారు.

పోలీసులు ఫిట్‌గా ఉండాలి


మొబిలైజేషన్ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి

బొమ్మలసత్రం: పోలీసులు శారీరకంగా ఫిట్‌గా ఉండటంతో పాటు విధుల్లో నైపుణ్యం మెరుగు పరుచుకోవాలని జిల్లా ఎస్పీ కె రఘువీర్‌రెడ్డి సూచించారు. స్థానిక ఎస్పీ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఏఆర్ సిబ్బందికి మొదటి విడత మొబిలైజేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఏఆర్ సిబ్బందికి ఏటా మొబిలైజేషన్ కార్యక్రమంలో భాగంగా గన్ ఫైరింగ్, డ్రిల్, కవాతు, మాబ్ కంట్రోల్, ప్రముఖుల బందోబస్తు తదితర అంశాలపై శిక్షణ ఇస్తామన్నారు. అలాగే యోగా, ధ్యానం చేయడం నేర్పించి మానసికంగా దృఢంగా ఉండేలా చూస్తున్నామన్నారు. సిబ్బంది ఆరోగ్యం కోసం ఉచితంగా మెడికల్ క్యాంపులు నిర్వహించి మందులు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రమణ, ఏఆర్ డీఎస్పీ సుంకురయ్య తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులకు చెక్కుల పంపిణీ


చెక్కులను అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): పాడి రైతులకు విజయ డెయిరీ చైర్మన్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎండీ పరమేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం పలు పథకాలకు చెందిన చెక్కులు పంపిణీ చేశారు. కల్యాణమస్తు పథకం కింద ఒక్కో పాడి రైతు కుమార్తెకు రూ.5వేల చొప్పున 17 మందికి రూ.85 వేలకు సంబంధించిన చెక్కులు, పశువుల కొనుగోళ్లకు సంబంధించి 20 శాతం సబ్సిడీతో 20 మంది పాడి రైతులకు రూ.2.62 లక్షలు, పాలు పోస్తూ మృతి చెందిన ఇద్దరు రైతుల కుటుంబాలకు క్షీరబంధు పథకం కింద రూ.లక్ష చొప్పున చెక్కులు అందజేశారు. అనంతరం చైర్మన్ జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ డెయిరీని నమ్ముకున్న ఏ రైతు ఇబ్బంది పడకూడదన్న ఉద్దేశంతోనే పలు పథకాల ద్వారా వారిని ఆదుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో ఓఎస్‌డీ ప్రదీప్‌కుమార్, డిప్యూటీ డైరెక్టర్ రాజేష్, మేనేజర్లు పాల్గొన్నారు.

గంజాయి విక్రేతల అరెస్ట్

డోన్ టౌన్: స్థానిక భారత్ దాబా సమీపంలో గంజాయి విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేశారు. పట్టణ ఎస్ఐ శరత్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని కొత్తపేటకు చెందిన ఈడిగ ఈశ్వర్‌గౌడ్, చిగురమానుపేటకు చెందిన ఎరుకల రాములమ్మ ఇతరుల నుంచి గంజాయి కొనుగోలు చేసి స్థానికంగా విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు దాడి చేసి అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సూక్ష్మ చిత్రం.. రంజాన్ సందేశం


మధుకృష్ణ రూపొందించిన కాబా నమూనా

ప్యాపిలి: మండల పరిధిలోని వెంగళాంపల్లి గ్రామానికి చెందిన సూక్ష్మ చిత్రకారుడు బండి మధుకృష్ణ సుద్దముక్కతో కాబా, మసీద్ నమూనాలను రూపొందించాడు. పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ముస్లిం సోదరులు కఠోర ఉపవాసాలను ఆచరిస్తున్నారని మధుకృష్ణ తెలిపారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ముస్లీం సోదరులు సౌదీలో పవిత్రంగా భావించే మక్కా నగరంలోని కాబా, మదీన నగరంలోని మస్జీద్‌ఏ నబవి నమూనాలను రూపొందించినట్లు తెలిపారు.

అత్తమామలు ఏసీ కొనివ్వలేదని..

- భార్యపై భర్త దాడి

బొమ్మలసత్రం: అత్తమామలు ఏసీ కొనివ్వలేదని ఓ వ్యక్తి భార్యను చితకబాదిన ఘటన శుక్రవారం నంద్యాల పట్టణంలో చోటు చేసుకుంది. టూటౌన్ సీఐ ప్రభాకర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. అన్నమయ్య జిల్లా గాలివీడుకు చెందిన సల్మాను పట్టణంలోని టీచర్స్ కాలనీలో నివాసముంటున్న షేక్ మహమ్మద్‌రఫీకి ఇచ్చి రెండేళ్ల క్రితం వివాహం జరిపించారు. ఇతను స్థానిక చోలమండల్ ఫైనాన్స్‌లో రికవరీ ఏజెంట్‌గా పని చేస్తున్నాడు. వేసవిలో ఉక్కపోత ఉందని, ఏసీ ఇప్పించాలని సల్మా తల్లిదండ్రులకు ఫోన్‌చేసి హుకుం జారీ చేశాడు. తమ వద్ద అంత డబ్బు లేదని వారు చెప్పడంతో మహమ్మద్‌రఫీ బెల్టు, గరిటలతో సల్మాపై దాడి చేశాడు. ఆమెకు తీవ్ర గాయాలు కావడంతో బంధువులు స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు మహమ్మద్‌రఫీపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

హంస వాహనంపై రంగనాథుడు విహారం


ప్రభోత్సవాన్ని నిర్వహిస్తున్న భక్తులు

జూపాడుబంగ్లా: తర్తూరులో వెలిసిన శ్రీ లక్ష్మీరంగనాథుని బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజు శుక్రవారం స్వామివారు హంసవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి వారిని అలంకరించి హంసవాహనంపై ఉంచి ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం ప్రభోత్సవ వాహనంపై స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని ఉంచి జయ జయ ధ్వానాల మధ్య ఊరేగించారు. ఉత్సవాల్లో భాగంగా శనివారం శేషవాహనసేవ నిర్వహించనున్నట్లు ఈఓ వెంకటరమణ, కమిటీ చైర్మన్ ప్రతాపరెడ్డి, ప్రధాన అర్చకుడు ఈశ్వరరెడ్డి తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

COACHING

■ **PARIMALA EAMCET SHORT TERM COACHING** With Hostel Rs. 7,000/- | Day Scholar Rs. 5,000/- MPC STUDENTS ONLY. Birla gate, Kurnool. Cell: 80086 20022, 7842335200 [L-795034]

■ **APRJC, Polytechnic,** Shreshta (8&10 Classes) Yashasvi (8&10 Classes) మొదలైన ప్రవేశ పరీక్షల కొరకు ప్రత్యేక కోచింగ్ ఇవ్వబడును. హాస్టల్ వసతి కలదు. సంప్ర : Right Academy - KNL Cell : 94939 02958 [L-795029]

REAL ESTATE

■ 'పద్మ రెసిడెన్సీ' అపార్ట్మెంట్ టీచర్స్ కాలనీలో 26 లక్షల మొదలు Flats & పుల్లారెడ్డి డెంటల్ కాలేజ్ దగ్గరలో 78 లక్షలలో లగ్జరీ 3BHK హౌస్ & నూనెపల్లి రోడ్ సూపర్ లగ్జరీ డూప్లెక్స్ హౌస్ అమ్మకమునకు కలవు. 90145 80500 [L-795036]

PLOT FOR SALE

■ ఓర్వకల్లు–శకునాల సోలార్ పార్కు ప్రక్కన 30x40 (2.75 సెంట్లు) ఓపన్ ప్లాట్లు అమ్మకానికి కలవు. సెంటు 1.10 లక్షలు మాత్రమే. సంప్ర: నితిక డెవలపర్స్ 98884 24222 [L-795037]

■ ఓర్వకల్లు దగ్గర జయరాజ్ స్టీల్ ఇండస్ట్రీ రోడ్‌కు తక్కువ ధరకు ఓపెన్ ప్లాట్లు కలవు. 2.75 సెంట్లు 5.5 లక్షలు. స్పాట్ రిజిస్ట్రేషన్ చేసుకొనే సౌకర్యం కలదు. శ్రీష్ణమూర్తి – 95330 49765 [L-795156]

■ భాష్యం న్యూHMDA వెంచర్ హైదరాబాద్ @ కొత్తూరు బెంగుళూరు హైవే 1 K.M అన్ని డె॥ క్లబ్‌హౌస్, స్విమింగ్ పూల్ 50% బ్యాంక్ లోన్ తో ప్లాట్లు కలవు. Ph: 9951329192 [HA-852]

HOUSE FOR SALE

■ Kuda Approvalతో గణేష్ నగర్‌లో Padma's Residency అపార్ట్మెంట్‌లో 1,2,3 BHK Flats & పుల్లారెడ్డి డెంటల్ కాలేజ్ దగ్గరలో 77 లక్షలలో లగ్జరీ 3BHK హౌస్ & నూనెపల్లి రోడ్ సూపర్ లగ్జరీ హౌస్ అమ్మకమునకు కలవు. 90143 35313, 90143 35513 [L-795006]

WANTED

■ కర్నూలులో ప్రముఖ AZ MASS కన్‌స్ట్రక్షన్ కంపెనీ నందు పనిచేయుటకు అనుభవం గల మేనేజర్లు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, టెలికాలర్స్ & స్టాఫ్ కావలెను. సెల్ : 90294 92949 [L-795033]

■ **Wanted Faculty to work in Reputed College, Qualification : B.Sc Nursing, Contact : 99890 66432, 62813 94858** [L-795157]

■ మీ ఇంటిదగ్గర ఉండి మా కంపెనీ బల్బులు ఫిట్ చేసి ఇవ్వడం ద్వారా నెలకి 15000 నుంచి 20,000 వరకు జీతం.మరిన్ని వివరాలకై 7815811791 [G-795292]

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీవసతి + భోజనం. జీతం: 16k - 18k ఎజెంట్ కమీషన్ 6K. ఫోన్: 9640258899 [HA-1164]

■ కర్నూలు, నంద్యాల, బనగానపల్లెలోని ప్రముఖ స్కూల్స్, హాస్పిటల్స్‌లలో వార్డెన్లు, సెక్యూరిటీ గార్డ్స్, రిసెప్షనిస్టులు, ఒపి నర్సులు, ఆఫీసు బాయ్స్, హౌస్ కీపింగ్, సూపర్ వైజర్స్, టెలికాలర్స్, స్కావెంజర్స్, బిల్లింగ్ ఎగ్జిక్యూటివ్స్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, ఎలక్ట్రీషన్స్‌గా పనిచేయుటకు ఆసక్తి గల స్త్రీ, పురుషులు కావలెను. సంప్ర: 96668 48880, 80088 69176, 63039 04265 [L-795035]

■ **Wanted Marketing Executives For** Realestate Ltd Company Work In Hyderabad only 5 hours with accommodation. 12000/- Salary. Contact: 7675869451 [HA-92803]

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. జీతం: 15000+ ఇన్సెంటివ్స్. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-795290]

■ VIP's ఇంట్లో పేషెంట్‌ని చూసుకోడానికి స్త్రీలు/పురుషులు అర్జెంటుగా కావలెను ఆయా, వార్డ్ బాయ్స్, నర్సులు, వంటవారు, Rmp Dr, Q: 5th- డిగ్రీ. 10-30 వేలు జీతం, భో+రూ ఫ్రీ, Hyd, Ph: 7995365999 [HA-1151]

■ మ్యాన్ పవర్ & సెక్యూరిటీ ఫీల్డ్‌లలో అనుభవం ఉన్న ఫీల్డ్ ఆఫీసర్స్ కావలెను. (ప్రాఫిట్‌లో షేర్ ఇవ్వబడును). Mega Group Man Power & Security (AP & TS). Contact : 70326 10569, 70931 25169. [NA-5476]

■ **Wanted Teachers** (CBSE), NEET & JEE Faculty, Sal: 12-15 Lakhs, Exp. Candidates, Send C.V. info@dheeranchinnamalaischool.ac.in, Dheeran Chinnamalai School & Academy, Krishnagiri (Dist),Tamilnadu, 9442882228. [T-1201063]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

